నాలుగు బొలెరో వాహనాల ఇసుకకు రూ.8400

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని మంజీర పరివాహక ప్రాంతం నుండి అనుమతులు లేకుండా నాలుగు బొలెరో వాహనాల్లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు కేసులు నమోదు చేసి అందులోని ఇసుకను బిచ్కుంద తహసిల్దార్ రవికాంత్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిబాబా మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించారు. కాగా ధర రూ.8400 పలికింది. వేలంపాటలో వచ్చిన డబ్బులను వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ ఖజానాలో జమ చేయనున్నట్టు ఆర్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఆర్ఐ

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

బుధవారం 01 ఫిబ్రవరి 2023

ఓపెన్ పది, ఇంటర్‌ల పరీక్ష ఫీజులు చెల్లించాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశం పొందిన వారు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు చెల్లించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద కొడపగల్ స్టడీ సెంటర్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గంగా కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అపరాధ రుసుంతో 22వ తేదీ వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. పాఠశాలకు వచ్చి చెల్లించాలని, ఫీజు చెల్లించని వారికి పరీక్ష రాయడానికి అనుమతి ఉండబోదని తెలిపారు.

తుపాకుల మోత.. తూటాలతో వేట

- అడవిలో విచ్చలవిడిగా వన్యప్రాణుల వేట
- ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు మాంసం తరలింపు

నవతెలంగాణ-లింగంపేట్

అటవీ ప్రాంతంలో తుపాల మోతతో వన్యప్రాణులు విలవిలలాడుతు న్నాయి. విచ్చలవిడిగా నాటు తుపాకులను ఉపయోగిస్తూ జంతువులను యథేచ్ఛగా వేటాడుతున్నారు. వన్యప్రాణులే లక్ష్యంగా కాపు కాస్తూ తూటా దించుతున్నారు. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో వన్య ప్రాణులను బలి పెడుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంగా పలువురు వేటగాళ్లు.. అటవీ ప్రాంతంలోని గ్రామస్తులను సంబంధం ఏర్పాటు చేసుకొని వన్యప్రాణులను చంపి మాంసాన్ని జిల్లా కేంద్రం మీదుగా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం. దీంతో జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుండటం గమనార్హం. వన్యప్రాణుల వేటగాళ్లను కట్టడి చేయడంలో అటవీశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలోని గాంధారి, మాచారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట్, బాన్సువాడ, రామారెడ్డి, రాజంపేట, తాడ్వాయి మండలాల్లో దట్టమైన అడవులున్నాయి. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీరు లేకపోవడం వన్యప్రాణులు అటవీ ప్రాంతంలోని చెరువుల వద్ద కుంటల వద్దకు తాగునీటి కోసం వస్తుండగా.. అదును చూసి వేటగాళ్లు షికారు చేస్తున్నారు. ఏకంగా కొందరు నాటు తుపాకులు సాయంతో వన్యప్రాణులు లను హతమారుస్తున్నారు. కొందరు సరదా కోసం వేటాడుతుండగా.. మరికొందరు వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

వేటాడేందుకు ఏకంగా నాటు తుపాకులను వినియోగిస్తుండటం గమనార్హం. ఇటీవల నిజాంసాగర్ మండలంలో నాటు తుపాకులు వెలుగులోకి వచ్చాయి. లింగంపేట్ మండలంలో ఒంటరిపల్లి తండాకు చెందిన గిరిజనుల సాయంతో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు నాటు తుపాకుల సాయంతో పోతాయిపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను చంపి తరలిస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లాలో రోజు రోజుకు వేటగాళ్లు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి వేళలో పెద్ద మొత్తంలో నాటు తుపాకులను ఉపయోగించి షికారి చేస్తున్నారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో కొంతమంది వన్యప్రాణుల వేటగాళ్ల వద్ద నాటు తుపాకులు ఉన్నట్లు సమాచారం. సమయం వచ్చినప్పుడే బయటకు తీసి గోప్యంగా రహస్య ప్రదేశంలో దాచి పెడుతున్నారని సమాచారం.



ఫైల్

విచ్చలవిడిగా వన్యప్రాణుల వేట

జిల్లాలో విచ్చలవిడిగా వన్యప్రాన వేట కొనసాగుతుంది. గాంధారి మండలం నేరెళ్ల తండాలో శివారులో పంట పొలం వద్ద ఉచ్చు బిగించి మనుబోతున్నత హతమార్చిన సంఘటన ఐదుగురు పై కేసు నమోదయింది. ఇటీవల లింగంపేట మండలంలోని మోతే భక్తిప్ప గడ్డ తండా చెందిన ఒక వ్యక్తి పంట పొలం వద్ద షికారి కోసం ఉచ్చు వేసి వలవేసి మూడు కొండ గొర్రెలను పట్టుకోగా అందులో నుంచి ఒకటి తప్పించుకుంది. ఏకంగా మాంసాన్ని విక్రయించేందుకు సిద్ధం చేశారు. గత సంవత్సరం పోతాయపల్లి అటవీ ప్రాంతంలో హైదరాబాద్‌కు చెందిన వేటగాళ్లు ఒంటరిపల్లి గిరిజనుల సహకారంతో వేటాడి వాహనాల్లో తరలిస్తుండగా మాచారెడ్డి మండలం ఫరీద్ పేట శివారులో వారిని పట్టుకున్నారు. గాంధారి మండలం సర్వాపూర్ గ్రామ సమీపంలో వన్యప్రాణులను వేటాడ్డానికి వెళ్లిన వేటగాడిని పట్టుకున్నారు. రామారెడ్డి మండలం రెడ్డి పేట చెందిన రాజు అరే యువకుడు వన్య ప్రాణులను వేటాడానికి వెళ్లి రాళ్లలో ఇరుక్కున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇలా రోజురోజుకు గుర్తుచప్పుడు కాకుండా వన్యప్రాళ్లను వేటాడుతున్నారు. కొందరు అటవీ ప్రాంతాల్లో పంట పొలాల వద్ద విద్యుత్ వైర్లకు తగిలి వన్యప్రాల మృతిచెందితే గుట్టుచప్పుడు కాకుండా మాంసాన్ని విక్రయిస్తున్నారు.

వన్యప్రాణుల మాంసానికి డిమాండ్

జిల్లాలో రవాణా మార్గం విస్తృతంగా ఉండడంతో కొందరు అదే పనిగా పెట్టుకుని యథేచ్ఛగా వన్య ప్రాణులను వేటాడుతున్నారు. వేటాడిన వాటి మాంసాన్ని జిల్లా కేంద్రం మీదుగా హైదరాబాద్ కు తరలిస్తున్నట్లు తెలిసింది. కొండ గొర్రె జింక మనుబోతు నీళ్ల గాయ్ దుప్పి లాంటి వన్యప్రాణుల మంసానికి డిమాండ్ నెలకొన్నట్టు సమాచారం. కిలో మాంసం ధర 1500–2000 పలుకుతున్న భోగట్ట. అటవీ అధికారులు నిఘా పటిష్ఠం చేయాలని, అడవిలోకి వెళ్లివచ్చే మార్గాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

నికిత, జిల్లా అటవీ శాఖ అధికారి

వన్నె ప్రాణుల వేటగాళ్ల కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఆమె అన్నారు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా వన్యప్రాణులను వేటాడితే సమాచారం అందించేందుకు సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేస్తున్నామన్నారు రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

నిజామాబాద్ కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హనుమంతు

వికారాబాద్ కలెక్టర్‌గా నారాయణరెడ్డి బదిలీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హనుమంతు నియమితులైయ్యారు. ఇది వరకు బాధ్యతలు నిర్వహించిన నారాయణరెడ్డిని వికారాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది కలెక్టర్‌ను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. హన్మకొండలో కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ హనుమంతు బదిలీపై నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజీవ్‌గాంధీ హన్మంతు 2012వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన కలెక్టర్. జిల్లాల పునర్విభజన సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో మిషన్ కాకతీయలో చేపట్టిన పనులకు గాను 2017లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. చెరువుల మరమ్మతు చేయడంలో, రైతులకు సాగు నీటిని అందించడంలో కలెక్టర్ చురుకైన పాత్ర పోషించినట్టు కితాబు అందుకున్నారు. అనంతరం 2020లో హన్మకొండ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

అర్హులైన బీడీ కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్ డిమాండ్



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణంలో గతంలో బీడీ కార్మికుల కోసం ఇళ్ల స్థలాలు ఇచ్చిన వాటికి హద్దులు చూయించలేదని వారికి వెంటనే హద్దులు చూయించి ఇళ్లస్థలాల్లో డబుల్ బెడ్ రూమ్ కట్టించి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణంలో ఇల్లు లేని పేదలు వందలాదిమంది ఉన్నారని వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ అయినా ఇవ్వాలని, లేదా కనీసం గుడిసెలు వేసుకోవడానికి ఇండ్ల స్థలమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎల్లారెడ్డి పోరాట కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేశ్వరి, కార్యదర్శిగా శారద, కోశాధికారిగా పద్మ ఉపాధ్యక్షులుగా కవిత, లక్ష్మి, సుజాతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు చంద్రయ్య, కృష్ణ పాల్గొన్నారు.

కనీసంగా 25 మంది కూలీలకు పని కల్పించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 25 మంది కూలీలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజు తెలిపారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి పనుల్లో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎఫ్సి బారని, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు

సెప్టిక్‌ట్యాంక్ క్లీన్ చేస్తూ అడ్డాకూలీ మృతి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టిన సీఐటీయూ నాయకులు, కుటుంబీకులు




మృతిచెందిన హరిప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అడ్డా కూలీల పరిస్థితి గాలిలో దీపం లాగా మారిందని, పొట్టకూటి కోసం ప్రాణాలను కూడా పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల గోవర్ధన్ అన్నారు. కార్మికుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఒకటో టౌన్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ పార్క్‌లో అడ్డా కూలీగా పనిచేస్తున్న హరి ప్రసాద్ అనే భవన నిర్మాణ కార్మికుడిని హబీబ్ నగర్ కి చెందిన హస్మత్ అలీ అనే భవన యజమాని సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసేది ఉందని తీసుకువెళ్లాడు. ఎటువంటి కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా, రక్షణ చర్యలు చేపట్టకుండా సెప్టిక్ ట్యాంక్‌లోకి దించడం ద్వారా నామ్ దేవ్ వాడకు చెందిన హరిప్రసాద్ అనే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని, హరి ప్రసాద్ మృతికి ఇంటి యజమానే కారణమని, ఆయనను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన కుటుంబానికి 50 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుని తల్లి లక్ష్మి, సోదరుడు విక్రమ్, సీఐటీయూ నగర కోకన్వీనర్ ధ్యారంగుల కృష్ణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బిజిగం సుజాత తదితరులు ధర్నా చేపట్టారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని మర్కల్‌లో పలువురు లబ్దిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, బాధితులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి పథకాలు దేశంలో కూడా అమలు చేయాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ ఏర్పాటు చేశారని తెలిపారు. రైతుల కోసం ఆలోచించే ప్రభుత్వం కావాలని బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటయిందని, దేశంలోని వివిధ రాష్ట్రాల రైతులు తెలంగాణ రాష్ట్రం వైపు చూస్తున్నారని, తెలంగాణలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటిసి కమిలి నరసింహులు, ఎంపీపీ గైని అనసూయ, టీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ బొలిపల్లి మహేందర్ రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోహినుద్దీన్, సర్పంచులు జూకంటి సంగారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలి

- బకాయి వేతనాలు చెల్లించి చట్టబద్ధహక్కులను కల్పించాలి
- కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్
- లేకుంటే 6న చలో హైదరాబాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించి బకాయి వేతనాలు చెల్లించాలని, చట్టబద్ధ హక్కులను కల్పించాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పైన ధర్నా నిర్వహించి, అనంతరం సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్, మిషన్ భగీరథ జిల్లా అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ స్కీం లో పంపు ఆపరేటర్, లైన్మెన్, ఫిట్టర్ ఎలక్ట్రిషన్ ఆపరేటర్స్, వాలు ఆపరేటర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, వాచెమెన్, సూపర్వైజర్ తదితర హెూదాల్లో పని చేస్తున్నారని తెలిపారు. 'మిషన్ భగీరథ స్కీం లో సుమారు 16 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. భగీరథ కార్మికుల శ్రమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి అనేక బహుమతులు వచ్చాయి. కార్మికుల స్థితి ఏమాత్రం బాగోలేదు.. చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నారు. మిషన్ భగీరథ స్కీం నిర్వహణకు తీసుకున్న కంపెనీలు కార్మికుల పొట్ట కొడుతున్నాయి. కనీస వేతనాలు అమలు చేయాల్సిన ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీని ఫలితంగా మిషన్ భగీరథ కార్మికులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లు 18 వేలకు పైగా చూయిస్తున్నారు కానీ కార్మికులకు మాత్రం 8500 నుండి 12 వేల రూపాయల లోపు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. గతంలో ఆర్ డబ్ల్యూఎస్ స్కీమ్ ను ప్రస్తుతం మిషన్ భగీరథగా మార్చారు. ఆర్ డబ్ల్యూఎస్ స్కీం గా కొనసాగుతున్నప్పుడు కార్మికులకు జీవో నెంబర్ 11 అమలు అవుతుండేది ప్రస్తుతం జీవో ఎంఎస్ నెంబర్ 11 భగీరథ స్కీం లో పనిచేసే కార్మికులకు అమలు చేయడం లేదు. లైన్‌మెన్‌ల పరిస్థితి కడు దరిద్రంగా ఉంది. వచ్చే 8500 వేతనంలో పెట్రోల్ అలవెన్స్ కిందనే సుమారు 3000 రూపాయలు ఖర్చవు తుంది. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని నీళ్ళు అందించడం అనేది భగీరథ స్కీం లోనే జరుగుతుంది. వెంటనే లైన్మెన్ లకు ట్రావెల్ అలవెన్సులు చెల్లించాలి. స్కీం లో పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిం చాలని' డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, 20 శాతం బోనస్, రక్షణ పరికరాలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ నేరుగా డిపార్మెంటే జమ చేయాలని, సంవత్సరానికి 15 రోజులు వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 6న చలో హైదరాబాద్ ను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ జిల్లా నాయకులు, బార్ రాజు, ప్రేమ్ తారాచంద్ జనార్ధన్ స్వామి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని యధావిధిగా ఏర్పాటుచేయాలి

- తొలగించేందుకు సహకరించిన పోలీసులను సస్పెండ్ చేయాలి
- జాతీయ రహదారిపై పెద్దఎత్తున గౌడ కులస్తుల రాస్తారోకో

నవతెలంగాణ-మోర్తాడ్

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే మళ్లీ యధావిధిగా ఏర్పాటు చేయాలని గౌడకులస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి–63పై పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి పగుళ్లు ఏర్పడటంతో గౌడ కులస్తులు ఆ విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహం ఏర్పాటుకు తలచారు. గాంధీ విగ్రహంతో పాటు సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఓ వర్గానికి చెందిన పాపన్నగౌడ్ విగ్రమం ఏర్పాటును వ్యతిరేకించడంతో గత 15 రోజులుగా రెండు విగ్రహాలు ముసుగులతో పోలీసుల రక్షణలో ఉన్నాయి. అధికారులతో చర్చలు జరుగుతు న్నాయి. ఈ క్రమంలో పోలీసులు లేని సమయం చూసి సోమవారం పాపన్నగౌడ్ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి గ్రామపంచా యతీలో ఉంచారు. దీన్ని నిరసిస్తూ స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. పాపన్న ఒక వర్గానికి చెందిన వాడు కాదని అన్ని కులాలకు కావలసిన వ్యక్తిని అన్నారు. రెండు విగ్రహాల ఏర్పాటు కోసం రెండు గద్దెలు నిర్మించినప్పుడు వ్యతిరేకించలేదని, విగ్రహం ఏర్పాటు చేసిన అనంతరం ఎందుకు వ్యతిరేకిస్తు న్నారని ప్రశ్నిం చారు. విగ్రహం తొలగింపునకు పరోక్షంగా సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే రోడ్డు నుండి పాలెం జాతీయ రహదారి వరకు ర్యాలీగా తరలివచ్చి రహదారిపై బైఠాయించి గంటన్నర వరకు నిరసన చేపట్టారు. గౌడ కులస్తుల నిరసనతో ఇరు వైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం అందుకున్న తహసిల్దార్ బాబన్న అక్కడికి చేరుకొని.. సమస్యపై వినతిపత్రం సమర్పిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేపట్టి నినాదాలు చేస్తున్న గౌడ కులస్తులు

20 ఏండ్ల రాజకీయ జీవితంలో కనీస సాయం చేశావా..?

- జడ్పీటీసీపై చేసిన అరోపణలు వెనక్కు తీసుకోవాలి : కాంగ్రెస్

నవతెలంగాణ-రామారెడ్డి

స్థానిక జడ్పిటిసి నా రెడ్డి మోహన్ రెడ్డి పై మండల రైతు బంధు అధ్యక్షులు గురజాల నారాయణరెడ్డి చేసిన ఆరోపణలకు, అనుచిత వ్యాఖ్యలకు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉప్పల్‌వాయిలో మాజీ కారోబార్ కుమార్, కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉప్పల్‌వాయి నుండి ఏకగ్రీవంగా మార్కెట్ కమిటీకి డైరెక్టర్గా ఎన్నుకుంటే, గ్రామ సాయిబాబా దేవాలయానికి రూ, రెండు లక్షలు ఇస్తానని చెప్పి ఇప్పటివరకు ఒక రూపాయి ఇవ్వలేదని, సొసైటీ చైర్మన్ ఎన్నికల్లో తన ఓటు తానే వేసుకోలేని పరిస్థితి అని ఎద్దేవ చేశారు. నా రెడ్డి మోహన్‌రెడ్డి.. స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేదలేందరికో సేవ చేశారని అన్నారు. నారాయణరెడ్డి 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉప్పల్‌వాయిలో కనీసం ఒకరికైనా రూ.2000 ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని, స్థానిక జెడ్పిటిసి నీ విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. కార్యక్రమంలో అన్నం రామ్ రెడ్డి, సంకి రాజు, పంగా బబ్లు, జంగిటి నారాయణ, కుమ్మరి శంకర్, సూరంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసి పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని సుకన్య ఏషియా స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీలలో ఎల్లో బెల్ట్ సాధించినట్టు హెచ్ఎం రాజేశ్వరశర్మ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థిని సుకన్యకు ఉపాధ్యాయులు అభినందించారు. జనవరి 29వ తేదీన హైదరాబాదులోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో షుహారి షోటోకన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ నాకయమ్మ షోటోకన్ కరాటే డూ ఇండియా పోటీలలో విద్యార్థిని పాల్గొని ఏషియా స్థాయిలో ఎల్లో బెల్ట్ సాధించారని ఆయన తెలిపారు. సుకన్య బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ కూతురని తెలిపారు. పోలీసు అధికారి అయిన సీఐ ప్రేమ్ కుమార్ తన కూతురుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి ఆదర్శంగా నిలిచారని ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఈశ్వర్, నగేష్ బాబు, ఖైరాన్, ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల ఉన్నారు.

హామీని నిలబెట్టుకోని ముఖ్యమంత్రి

- **మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

మధ్యాహ్న భోజన కార్మికులకు హామీనిచ్చిన ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోలేదని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరి చక్రపాణి అన్నారు. మంగళవారం సౌత్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడారు. రాబోయే కాలంలో సమస్యలు పరిష్కరించకుంటే తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం యూనియన్ తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, సాయమ్మ, నాగమణి, సీఐటీయూ ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ కార్మికులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోపు

పోడు భూముల ప్రక్రియను పూర్తి చేయాలి

- **కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోడు భూములకు సంబంధించిన ప్రక్రియను వారం రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని, అర్హులైన వారికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందించేందుకు వీలుగా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్ హాల్‌లో ఆర్ఓఎఫ్ఆర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పోడు భూములకు సంబంధించి వచ్చిన క్లెయిమ్‌లు, క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలన వివరాలు, గ్రామ సభల తీర్మానాలు తదితర అంశాలపై సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటికే వందశాతం గ్రామ సభలు పూర్తయ్యాయని, టైం లైన్ మ్యాప్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను క్లెయిమ్‌లతో జతపర్చడం జరిగిందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇంకనూ ఏమైనా క్లెయిమ్‌లు డివిజన్ స్థాయిలో పెండింగ్లో ఉంతే, తక్షణమే వాటిని జిల్లా స్థాయి కమిటీ పరిశీలన నిమిత్తం పంపించాలని కలెక్టర్ ఆర్డీఓలను ఆదేశించారు. తిరస్కరించిన క్లెయిమ్‌లను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు లోబడి అర్హత కలిగి ఉన్న వారికి తప్పనిసరి న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా స్థాయి కమిటీకి చేరిన నివేదికలను సైతం రెండు రోజుల్లో పరిశీలనను పూర్తి చేయాలని కలెక్టర్ నిర్దిష్టమైన గడువు విధించారు. క్లెయిమ్‌ల ఆమోదం లేదా తిరస్కరణకు గురైన వాటికి సంబంధించి స్పష్టమైన ఆధారాలను పొందుపర్చాలని సూచించారు. క్లెయిమ్‌ల పరిశీలన వివరాలను పక్కాగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా కంప్యూటరీకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ధిత డిజైన్‌లో పట్టా పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, డీఎఫ్ఓ వికాస్ మీనా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగూరావు, ఆర్డీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులైన భీంగల్, మోపాల్, సిరికొండ మండలాల జెడ్పిటీసీలు చౌట్పల్లి రవి, కమలా బానోత్, మాలావత్ మాన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

బడాపహాడ్ ఉర్సుకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహాడ్‌లో ఫిబ్రవరి 2 నుంచి ఉర్సు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వక్ఫ్‌బోర్డ్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అక్కడికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మంగళవారం శానిటేషన్ పనులను చేపట్టినట్టు జలాల్‌పూర్ సర్పంచ్ తిప్పారం అనిత వెంకట్ గౌడ్ తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని నీటి వసతి, రహదారి ఇరువైపులా మొరం వేయించినట్టు వివరించారు. స్పీకర్ ఆదేశాల మేరకు అన్ని విధాల ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సులేమాన్, ఎంపీవో చందర్, వక్ఫ్‌బోర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ జమాల్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.


శానిటేషన్ పనులు చేయిస్తున్న దృశ్యం

సంగెం పాఠశాలను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని సంగెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం పంచాయతీరాజ్ ఏఈ సాయిలు, ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులు పూర్తిచేసి బుధవారం ప్రారంభోత్సవానికి సిద్ధం చేయడంతో అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మండల రైతు సమితి అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, ఎంపీటీసీ హనుమంతు, టీపీ అల్తాఫ్ తదితరులు ఉన్నారు.

ఎంపీఓకు ఘన సన్మానం


ఎంపీవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి ఎంపీఓ రాజ్‌కాంత్ రావుకు ఉత్తమ ఎంపీఓగా అవార్డు పొందడం పట్ల ఎంపీపీ భదవత్ రమేష్ నాయక్, ఎంపీడీవో రాములు నాయక్ ఆధ్వర్యంలో ఇందల్‌వాయి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అరటి రఘు, సిహెచ్ దాస్, జూనియర్ అసిస్టెంట్లు విమలబాయి, లింగన్న, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు భరత్, వినయ్, తిరుపతి, యశ్వంత్, కార్యాలయ సిబ్బంది నారాయణ, బక్కన్నతో పాటు తదితరులు ఉన్నారు.

పేద మైనార్టీ కుటుంబానికి స్పీకర్ కుటుంబం అండ

నవతెలంగాణ-వర్ని

మండలంలోని ఎస్ఎన్ పురం గ్రామంలో ఖాసిమ్ సతీమణి బిడ్డకు జన్మ నిచ్చి మరణించడంతో ఆ కుటుంబం ఆర్థికంగా కృంగిపోవడంతో శనివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పలు మండలాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి బాన్సువాడ వెళ్తుండగా ఎస్ ఎన్ పురం గ్రామంలో డబుల్ ఇండ్లను ఆగి చూస్తుండగా ప్రక్కన ఇంటి వద్ద టెంటు వేసి ఉండటం చూసి స్థానిక ప్రజాప్రతినిధులకు విషయం ఆరా తీశారు. బతికున్న బిడ్డను ఎత్తుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబ పరిస్థితులను తెలుసుకొని వెంటనే రూ.50వేలు ఆర్థిక సాయంగా అందించారు. మంగళవారం స్పీకర్ తనయుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి ఖాసిం కుటుంబాన్ని పరామర్శించి స్పీకర్ ఆదేశాల మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లును తన సొంత ఖర్చులతో నిర్మించి ఇస్తానని తెలిపారు. ఆ కుటుంబానికి స్పీకర్ కుటుంబం అండగా నిలబడడంతో కుటుంబీకులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఆయన వెంట మండలాధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్, సీనియర్ టీఆర్ఎస్ నాయకులు మేక వీర్రాజు, పీఏసీఎస్ చైర్మన్లు కృష్ణారెడ్డి, నామాల సాయిబాబా, కోఆప్షన్‌మెంబర్ కరీం, కార్యకర్తలు తదితరులున్నారు.


కుటుంబాన్ని పరామర్శిస్తున్న సురేందర్‌రెడ్డి

మోడల్ కాలేజీల్లో స్కాలర్‌షిప్‌లు వెంటనే మంజూరు చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్/మాక్లూర్

మోడల్ కళాశాలలో స్కాలర్ షిప్‌లను వెంటనే మంజూరు చేయాలని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లోని ఆ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న మోడల్ కాలేజ్ గత 7 సంవత్సరాలుగా పేద విద్యార్థులు స్కాలర్‌షిప్ రాక నష్టపోతున్నారని, టెక్నికల్ సమస్య వల్ల స్కాలర్‌షిప్ రావడం లేదని కాలేజీ అధికారులు చెబుతున్నారని తెలిపారు. వెంటనే పేద పిల్లలకు స్కాలర్‌షిప్ వచ్చే విధంగా టెక్నికల్ సమస్యను పరిష్కారం చేసి పేద విద్యార్థులకు చేయూత నివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టీ భూమన్న, సాకలి రాజన్న, పల్లపు అంజయ్య, చిన్నయ్య, జవహర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లపు వెంకటేష్

అక్రమ నిర్మాణాలను తొలగించాలి..

మాక్లూర్ : భీమ్ చెరువు కట్టవెంట అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్న దానిని తొలగించాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి వెంకటేష్ అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని మాణిక్‌బండారు గ్రామ శివారులో బీమ్ చెరువు కింద ఏర్పాటు చేస్తున్న వెంచర్ యజమాని సాగేశ్వర్ రెడ్డి చెరువు కట్టను ఆనుకొని ప్రహరీ నిర్మిస్తున్నారు. దీనిని సీపీఐ(ఎం) నాయకులు సందర్శించారు. చెరువు కట్ట కింద దారి వదలకుండా కట్టను ఆనుకొని ప్రహరీ నిర్మిస్తున్న దానిపై తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండ గంగాధర్, గోవర్ధన్, చిన్నయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పలువురికి ఆపరేషన్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పలు శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ తెలిపారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వెన్నుముక విరిగి నడవలేని పరిస్థితిలో ఉన్న ఒకరికి ఆపరేషన్ చేశామని, అదేవిధంగా ఇద్దరు మహిళలకు అండాశయంలో గల కణతులను తొలగించామని వివరించారు.

బడాపహాడ్‌లో నూతన బస్టాండ్ నిర్మాణం

నవతెలంగాణ-వర్ని

2 నుంచి పెద్దగుట్ట దర్గా వద్ద మూడు రోజుల పాటు జరిగే ఉర్సు ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో రూ.13 లక్షల నిధులతో నూతన బస్టాండ్‌ను నిర్మించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పీకర్ ఆదేశించినట్టు ప్రజాప్రతినిధులు సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్ తెలిపారు.

మెడికవర్ ఓపీ బ్లాక్ ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఎల్లమ్మగుట్టలోని మెడికవర్ ఆసుపత్రి సేవలు హైదరాబాద్ రోడ్డులోని సురేష్‌బాజు ఆసుపత్రి నందు ఓపీ సేవలను అందించే విధంగా నూతన మెడికవర్ ఓపీ బ్లాక్‌ను సోమవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమానికి మెడికవర్ గ్రూప్ సీటీఓ మహేష్ దెగలూర్కర్, మెడికవర్ వైస్ ప్రెసిడెంట్ మేఘ చిట్యార హాజరయ్యారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భూపతిరెడ్డి, డాక్టర్ సందీప్‌రావ్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ దత్తురాజ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ యజ్ఞ, మేనేజ్‌మెంట్ స్వామి, శ్రీనివాస్ శర్మ లహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- **సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్**
- **నుడా చైర్మెన్‌కు వినతులు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి స్వర్ణ డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో టీచర్లతో సమానంగా వేతనం, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అర్బన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లగా..

ఎమ్మెల్యే లేకపోవడంతో అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ ప్రభా కర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ వినతిని అర్బన్ ఎమ్మెల్యేకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వాణి, జరీనా తదితరులు పాల్గొన్నారు.


నుడా చైర్మెన్‌కు వినతినిస్తున్న నాయకులు

ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంపై మాట్లాడాలి

ఫిబ్రవరి 3 నుంచి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం, ఇతర సమస్యలపైన ఎమ్మెల్యేలు మాట్లాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అర్బన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లగా.. ఎమ్మెల్యే లేకపోవడంతో అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ వినతిని అర్బన్ ఎమ్మెల్యేకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాలలో, రేణుక, సుకన్య, స్వప్న ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించి సర్పంచులను ఆదుకోవాలి

నవతెలంగాణ-నందిపేట్/జక్రాన్‌పల్లి

పెండింగ్ బిల్లులను చెల్లించి సర్పంచులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నందిపేట్ సర్పంచ్ వాణి, తిరుపతిని వారి స్వగృహంలో సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల నిధులు విడుదల చేయకపోవడంతో మానసికంగా ఇబ్బందులకు గురై కొద్దిమంది సర్పంచులు వారి భార్యల మెడలో ఉన్న పుస్తెలతాడును అమ్ముకొని ప్రభుత్వ పథకాల అభివృద్ధి పనులు చేశారని, కొద్దిమంది ఆస్తులు అమ్ముకున్నారని, గుండె నిబ్బరం లేని మరికొంతమంది సర్పంచులు ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలకు పెండింగ్లో ఉన్న బిల్లులకు నిధులను మంజూరు చేసి సర్పంచ్‌లను ఆదుకోవాలని, వారి ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు వై.ఓమయ్య, ఆనందం, రఘురాం, రాధా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ సర్పంచుకు పరామర్శ..

జక్రాన్‌పల్లి : నందిపేట్ సర్పంచును జక్రాన్‌పల్లి పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు శ్రీపతి శేఖర్ మంగళవారం పరామర్శించారు. సోమవారం నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి తిరుపతి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా వారి కుటుంబానికి పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు శ్రీపతి శేఖర్ వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు.


నందిపేట్ : సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

5న మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఫిబ్రవరి 5న గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు దాసు కార్మికులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసు పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 36 వేల మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని, వారందరికీ పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి (ఐఎఫ్‌టీయూ) జేపీ గంగాధర్, గ్రామపంచాయతీ డిచ్‌పల్లి మండల నాయకులు రాజేశ్వర్, నవీన్, రాజేష్, గంగాధర్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

పడగల్ గ్రామంలో వరి పంటలు పరిశీలన

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మండలంలోని పడగల్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నర్సయ్య మంగళవారం వరి పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందజేశారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-రెంజల్

పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ రామచందర్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని వీరన్న గుట్ట గ్రామపంచాయతీలో పౌర హక్కులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అస్పృశ్యత, రెండు గ్లాసుల పద్ధతులు కొనసాగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు ప్రభుత్వంపై చదువుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేయడానికి సిద్ధంగా ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బైండ్ల రాజు, ఎస్ఐ సాయన్న, ఎంపీడీవో శంకర్, ఎంపీటీసీ గంగాలత భూమేష్, హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్, యేసు శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి, స్థానికులు శ్రీకాంత్, శంకర్, అప్సర్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకు

3న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- **సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకు ఫిబ్రవరి 3న మున్సిపల్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నాందేవ్‌వాడలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కూడా ప్రజలకు పంపిణీ చేయలేని స్థితిలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండడం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. ఇండ్లు, ఇంటి స్థలాలు లేని నిరుపేదలు అధికారికంగా సర్వే చేసి వెల్లడించిన వారు పదివేలకు పైగా ఉన్నారని ప్రకటించారని, కానీ ఇంకా అనేకమంది అద్దె ఇండ్లలో ఉంటూ సొంత ఇంటి కల నెరవేర్చుకోలేని స్థితిలో ఉన్నారని అన్నారు. నిజామాబాద్ నగరానికి విచ్చేసిన మంత్రి కేటీఆర్ కళాభారతికి శంకుస్థాపన చేయడం కాదని.. కళావిహీనంగా తయారైన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల మీద, వాటి పంపిణీ మీద మాట్లాడకపోవడం పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఉన్న వారికి మూడు లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, స్థలం ఉన్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 3వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలందరూ వ్యక్తిగత దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులతో మున్సిపల్ కార్యాలయానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బెజుగం సుజాత, సీఐటీయూ నగర కో కన్వీనర్ కటారి రాములు, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ధ్యారంగుల కృష్ణ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల నరసయ్య, ఆవాజ్ కమిటీ నగర కన్వీనర్ ఎస్.కె అబ్దుల్, సీఐటీయూ నాయకులు దండే సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

త్వరితగతిన పనులను పూర్తి చేయాలి

- మోప్మా పీడీ రాములు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో మన ఊరు మన పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మోప్మా పీడీ రాములు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పనులను పరిశీలించారు. నేటితో ఈ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, పీఆర్ఏఈ లిఖిత, స్థానిక నాయకులు మేక సంతోష్, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-భీంగల్

బీజేపీ జిల్లా నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి మండలంలో పలువురు బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని నరసయ్య తండ్రి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే పురానిపేట్ సర్పంచ్ తల్లి మరణించడంతో వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు గంగాధర్‌గౌడ్, ప్రవీణ్ తదితరులున్నారు.

మున్సిపల్‌లో అక్రమాలపై గాంధీ విగ్రహం ముందు నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమాలకు నిరసనగా బీజేపీ కౌన్సిలర్లు మంగళవారం గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో సాధారణ సమావేశంలో భాగంగా కౌన్సిలర్లు కౌన్సిల్లో ప్రవేశపెట్టిన ఎజెండాలో పొందుపరచినటువంటి కొన్ని అంశాలను వ్యతిరేకించారు. పలుమార్లు మున్సిపాలిటీలో జరుగుతున్న జమ ఖర్చుల లెక్కలను వివరించాలని కమిషనర్ పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన గుర్జు క్రింది సతీష్‌ను కిడ్నాప్ చేసిన భీంగల్ గ్రామానికి చెందిన మల్లేష్‌ను ధర్పల్లి సీఐ సైదా, సిరికొండ ఎస్ఐ నర్సింలు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం ఉదయం జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద అదుపులోకి తీసుకుని సిరికొండ పోలీస్టేషన్‌కు తరలించారు. సీఐ సైదా వివరాలను వెల్లడించారు. కిడ్నాపర్ మల్లేష్‌కు సహకరించిన మరి కొంత మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ పేర్కొన్నారు.

సబ్సిడీ చెక్కు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

డిజెబుల్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చిన సబ్సిడీ చెక్కును మండల కేంద్రానికి చెందిన వికలాంగుడైన లబ్ధిదారుడికి 50 వేల సబ్సిడీ చెక్కును అందజేశారని ఎంపీడీవో లక్ష్మణ్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విమల రాజు, జెడ్పీటీసీ తనూజ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీలు గంగారెడ్డి, తలారి మరియా సతీష్, మండల కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలో బుధవారం నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయని ఆలయ ప్రధానార్చకులు రజినీ కాంతాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న బుధవారం పుణ్యాహవచనం, 2న అగ్ని ప్రతిష్ఠ హెూమం, ధ్వజారోహణ, 3న ఎదురుకోళ్ళు, 4న బలిహారణం, దోపుశేర, 5న రథ హెూమం, రథబలి, జాతర, 6న అన్నదానం, 7న నాగవెల్లి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్ర్రాలు సమయవేళలు పాటించాలి

నవతెలంగాణ-జుక్కల్

అంగన్‌వాడీ కేంద్రాలు సమయవేళలు పాటంచాలని జుక్కల్, పెద్ద ఎడ్గి క్లస్టర్ సూపర్ వైజర్లు వినోదా, దేవ కరుణా అన్నారు. మంగళవారం మండలంలోని 52 సెంటర్‌ల టీచర్లతో క్లస్టర సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యాప్‌లలో రోజువారిగా పిల్లల హజరు, టీచర్ హజరుతో పాటు సమయపాలన, రికార్డులలో నమోదు చేసి వివరాలను ఎప్పడికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు హన్మవ్వ, సాయవ్వ, ప్రేమల, లక్ష్మీ, సుమలత, బుజ్జి, రాదా, యమున, చెంచకళ, సుమలత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం కామారెడ్డి నూతన డిఎస్‌పి వి సురేష్ మొట్టమొదటిసారిగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై అనిల్‌ను.. క్రైమ్ వివరాలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, మండలంలో ప్రముఖ దేవాలయాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పోసానిపేట్ దేవాలయంలో జరిగిన దొంగతనాన్ని 24 గంటల్లో కేసును చేయించినందుకు ఎస్సై తోపాటు సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట సి ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



చలి తీవ్రతతో వరిపైర్ల ఎదుగుదల లోపం

- ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల క్షేత్రపర్యటన
- మొగి పురుగు నివారణకు మందును వెదజల్లొద్దు.. పిచికారీ చేయాలి
- వ్యవసాయాధికారుల సూచన

నవతెలంగాణ-దోమకొండ

ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో పాటు, రాష్ట్ర వరి పరిశోధనా కేంద్రం-రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త, శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దోమకొండ మండలంలోని లింగుపల్లితో పాటు బీబీపేట్ మండలంలోని ఇస్సనగర్ గ్రామాల్లో మంగళవారం పర్యటించింది. వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్త డా రఘు రమురెడ్డి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఉన్న చలి వాతావరణం వల్ల వరి పైర్ల ఎదుగుదల తక్కువగా ఉన్నాయని, మంచి ఎదుగుదల పిలకలు వేయడానికి ఎకరానికి 25 నుండి 30 కిలోల యూరియాతో పాటు 150 నుండి 200 గ్రాములు కార్బెండాజిం, మంకోజెబ్ కలిగిన పొడిమందును యూరియాలో కలుపుకొని పల్చగా నీరు ఉంచుకుని ప్రధాన పొలంలో చల్లుకున్నట్లయితే పైరు ఎదుగుదలకి తోడ్పడుతూ పిలకలు వేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే వరి పొలాల్లో నీటిమట్టాన్ని మొదటి దశలో ఒక ఇంచు కన్నా తక్కువగా ఉండేటట్లు చూసుకుంటూ కంకి దశ అలాగే పాలు పోసుకునే దశలో రెండు ఇంచులకు నీటిమట్టాన్ని ఉంచుకోవాలని సూచించారు. చౌడు పొలాలలో ప్రతి వానకాలం వరి వేసే ముందు పచ్చి రొట్ట పంటను వేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈ సందర్భంగా డా. రాంగోపాల్ వర్మ (ప్రధాన శాస్త్రవేత్త, కీటక శాస్త్ర నిపుణులు) మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాల్లో కాండం తలుచు పురుగు మరియు ఉల్లికోడును గమనించామని కాండం తొలుచు పురుగు మాత్రమే ఉన్నప్పుడు క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 జి గుళికలు ఎకరానికి 4 కేజీలు చొప్పున పల్చగా నీరుచుకుని ఇసుకలో కలుపుకుని చల్లుకోవాలని సూచించారు.


భిక్కనూర్ మండల కేంద్రంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

భిక్కనూర్ : భిక్కనూర్ పట్టణ కేంద్రంలో వరి పంటలను శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళ వారం పరిశీలించారు. వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ నుండి ప్రధాన వరి శాస్త్రవేత్త డాక్టర్ పి రఘురామిరెడ్డి, డాక్టర్ వర్మ, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ బాబు, కెవికె రుద్రూర్ నుండి డాక్టర్ ఎస్ నవీన్ కుమార్, డాక్టర్ రాజ్ కుమార్, సురేష్, విజయ్ శాస్త్రవేత్తలు బృందం మండలంలోని వరి పొలాలను పరిశీలించారు. వరి ఎండిపోవడాన్ని గమనించి రైతులకు తగు సూచనలు సలహాలు అందజేశారు. ప్రస్తుతం నాటు వేసిన తర్వాత 30 నుండి 35 రోజులు సమయంలో 25 కేజీల యూరియా, 200 గ్రాముల కార్బన్డైజిమ్, మాంకొజెబ్ కలిపి వేసుకోవాలని, పొలాన్ని అడపాద డపా ఆరబెట్టు కోవాలని సూచించారు. వరి చిరు పొట్ట దశకు వచ్చిన సమయంలో తప్పనిసరిగా ఒక ఎకరానికి 60 ఎంఎల్ కోరాజైన్ మందును స్ప్రే చేయడం వలన తెల్ల కంకి నివారణ అవుతుందని సూచించారు. కార్యక్రమంలో ఏ డి ఏ అపర్ణ, ఏవో రాధా, జడ్పీటిసి పద్మ నాగభూషణం గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, ఏఈవోలు వినోద్, రవి, ఆనంద్, రజిత, అఖిలేష్, రైతులు పాల్గొన్నారు.

పురుగులమందు వెదజల్లొద్దు

లింగంపేట్ : ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని నివారణకు రైతులు పురుగుమందులను వెదజల్లకుండా పిచికారి చేస్తే ఫలితాలు ఉంటాయని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. లింగంపేట్ మండలంలోని పరమల్ల రైతు వేదికలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం, ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. మొగి పురుగు నివారణకు క్లోరోపైరీఫాస్ 500 ఎంఎల్, లేదా ల్యాండ సైహలోత్రిన్ 250ఎంఎల్ లేదా కార్ టాప్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి మధ్యాహ్నం 3 గంటల నుండి పిచ్చికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. సాయంత్రం వేళలో పిచికారి చేయడం వలన పురుగుమందులు పురుగులపై సమర్థవంతంగా పనిచేసి పురుగును నివారించడానికి దోహదపడుతుందని తెలిపారు.

అదేవిధంగా రైతు బీమా పథకం గురించి రైతులకు వివరిస్తూ ఎవరైనా రైతులు చనిపోయినప్పుడు వారి వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారికి వీలైనంత త్వరగా తెలియజేస్తే.. సకాలంలో బీమా డబ్బులు అందే అవకాశం ఉందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్ పర్వయ్య, రైతుబంధు గ్రామ కో ఆర్డినేటర్ కొడబోయిన శ్రీనివాస్, రైతుబంధు మండల మెంబర్ కొడబోయిన సాయికుమార్, పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండలంలో రబీ సీజన్‌కు గాను రైతులు సాగు చేస్తున్న వరి పంటలో మోగి పురుగు బెడద అధికంగా ఉందని బిచ్కుంద వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్ అన్నారు. మండల కేంద్రం లోని వరి పంట లతో పాటు పోతిరెడ్డిపల్లి పంట పొలాలను పరిశీలించారు. నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ గీత, రైతులు పాల్గొన్నారు.

వరి తెగులు నివారణకు సూచనలు

బిచ్కుంద : బిచ్కుంద మండలంలోని శాంతపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో వరి పంటలను వ్యవసాయ అధికారి పోచయ్య రైతులతో కలిసి పరిశీలించారు. వరి పంటపై కాండం తొలిచే పురుగు, పాము పొడ తెగులు వరి నాటు లేటుగా వేసిన వరిపై ఉల్లికోడు వ్యాపించిందని రైతులు వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. నివారణ చర్యలు రైతులకు వివరించారు.



బిచ్కుంద మండలం శాంతాపూర్‌లో.. దోమకొండ మండలం లింగంపల్లిలో..

ముదిరాజ్ సంఘ భవనానికి రూ.10 లక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘ భవనం కోసం రూ. 10 లక్షల రూపాయలు, దారి కోసం 200 మీటర్ల నూతన సీసీ రోడ్ వేయించడంతో పాటు భవనానికి త్రీ ఫేస్ కరెంట్ సరఫరా మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యంకె ముజిబొద్దీన్, పార్టీ రాష్ట్ర నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గెరిగంటి లక్ష్మీనారాయణ, ముదిరాజ్ కౌన్సిలర్లు కాళ్ల గణేష్, పిట్ల వేణుగోపాల్, తేజ ప్రసాద్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


విప్‌ను సన్మానిస్తున్న కులసభ్యులు

మోతేలో పశువైద్య శిబిరం ఏర్పాటు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మోతే గ్రామంలో మంగళవారం కోరుట్ల పశు వైద్యకళాశాల ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్యశిబిరం నిర్వహించినట్టు పశువైద్యాధికారి రవికుమార్ తెలిపారు. బ్రూస్లిసిస్ వ్యాధి టీకాలు 12 పశు వులకు ఇచ్చినట్టు తెలిపారు. దీంతో పాటు పలు పశువులకు గర్భధారణ, టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి రామ్‌రెడ్డి, ఎంపీటీసీ జగదాంబ, పాల కేంద్రం అధ్యక్షులు కోరుట్ల పశు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ కుమారి, డాక్టర్ కీర్తన, లింగంపేట్ మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ జమ చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘ సభ్యులకు బకాయి పడిన వడ్డీ లేని రుణాల బకాయిలు, స్త్రీ నిధి వడ్డీ, అభయ హస్తం డబ్బులు వెంటనే చెల్లించాలని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణరెడ్డి అన్నారు. దోమకొండ కేంద్రంలో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి ర్యాలీ చేపట్టి ఎంపీడీవో చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చింతల రాజేశం, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు భూపాల్ రెడ్డి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదలకు వినతి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ మాట్లాడుతూ లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ విద్యార్థులు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి చదువుకుంటున్నారని, మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. బకాయిలు ఉండటంతో విద్యార్థులకు కాలేజీలకు నుంచి సర్టిఫికేట్‌లు రావడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకొని బకాయిలు వెంటనే విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బుల్లెట్, ఉపాధ్యక్షులు మాణిక్యం, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తడి పొడి విధానంపై అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలం లోని అంతంపల్లి గ్రామంలో కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్, పద్మపాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వరి సాగులో తడి పొడి విధానం అమలు చేసే రైతులకు నీటి గొట్టాలు ఎలా అమర్చాలో మండల కో ఆర్డినేటర్ మనోజ్ కుమార్ రైతులకు వివరించారు. మంగళవారం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో నీటి గొట్టం అమర్చి రైతులకు డెమో చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదు మోహన్ రెడ్డి, ఏయంసి చైర్మన్ భగవంత్ రెడ్డి, విండో చైర్మన్ వెంకట్ రెడ్డి,ఎంపీటీసీ మంజుల,ఏఓ రాధ, ఏఈఓ రజిత,ఆర్బిఎస్ చైర్మన్ గంగారెడ్డి, మండల కోఆర్డినేటర్ మనోజ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రానికి అనుకొని ఉన్న అన్నదమ్ముల చెరువులో మంగళవారం యువకుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి చనిపోయిన యువకుడు వయసు 25 నుండి 30 సంవత్సరాల లోపు ఉంటుందని ఎవరైన ఇతనిని గుర్తు పడితే 9440 7944 56 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. హత్య చేసి పడేశారా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.



మద్దికుంటలో గ్రామసభ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో మంగళవారం గ్రామ సర్పంచ్ బొమ్మిడి రామ్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. నిధుల మంజూరు, నిర్వహించిన పనులు, ఖర్చులపై గ్రామ కార్యదర్శి హరిలత నివేదిక చదివి వినిపించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్ సహకారంతో పూర్తి చేస్తామని సర్పంచ్ అన్నారు. పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు. ప్రతి ఒక్కరు గ్రామపంచాయతీ పన్నులను చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిడి రాంరెడ్డి, ఉప సర్పంచ్ నరేందర్, ఎంపీటీసీ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి హరిలత, పాలకవర్గ సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగితే
మానవత దృక్పథంతో సహాయం అందించాలి

సీపీ నాగరాజు
నవతెలంగాణ-ఆర్మూర్

రోడ్డు ప్రమాదాలు జరిగితే మానవతా దృక్పథంతో క్షతగాత్రులకు సహాయం అందించాలని సీపీ నాగరాజు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే తీసుకోవల్సిన ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం ఈఎంఆర్ఐ సౌజన్యంతో మంగళవారం పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 62 పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఏడాది కాలంలో 20 మంది కన్న ఎక్కువ రోడ్డు ప్రమాదాల వలన ప్రాణాలు కోల్పోయారని అన్నారు. అందులో జిల్లాలో ఆర్మూర్, డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లు ఉన్నట్టు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు ఉన్నట్టుతెలిపారు. 2022 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు దాదాపు 668 జరుగగా, 322 మంది మరణించారని, 659 మందికి గాయాలు అయినట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగి మరణించిన వారి కుటుంబం ఎంతో క్షోభ అనుభవి స్తుందని, చేతికి వచ్చిన కొడుకు చనిపో యిన, కుటుంబ పెద్ద చనిపోయిన వారి కుటుంబం ఆర్థికంగా క్షోభ అనుభవి స్తుందని అన్నారు. కావున రోడ్డులో ప్రయా ణించే ప్రతీ ఒక్కరు వారి మీద కుటుంబం ఆదారపడి ఉందని గమనించి ప్రయాణించాలని, రోడ్డు నియమనిబంధనలు ప్రతీ ఒక్కరు తూ.చ తప్పకుండా పాటించాలని, ప్రమాదం జరిగిన తర్వాత భాద పడేకంటే ప్రమాదం జరుగకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎక్కడనైన రోడ్డు ప్రమాదం జరిగితే తమకు ఏంటి అని అనుకోకుండా, మానవతా దృక్పదంతో సహాయం అందించాలని, ప్రథమ చికిత్స తప్పకుండా అందించి దగ్గరలోని హాస్పిటల్‌కు చేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఆర్.ప్రభాకర్ రావు, రోడ్డు సేఫ్టీ అధికారి ఎన్. చంద్రబాను, ట్రాఫిక్ ఎ.సి.పి నారాయణ, ఎమ్.వి.ఐ ఆర్. వెంకటస్వామి, ఈఎంఆర్ఐ క్లినికల్ ఇన్స్పక్టర్ సుమన్ మదుసుధన్ రావు, ఎస్. హెచ్. ఓ బి. సురేష్ బాబు, కమ్మర్పల్లి, మెండోరా, బాల్కొండ, ఆర్మూర్ ఎస్.ఐలు ఎమ్. రాజశేఖర్, జి. శ్రీనివాస్ యాదవ్, కె. గోపి, రాము తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ నాగరాజు

గ్రామసభ పెట్టి లెక్కలు తేల్చుదాం

- నందిపేట్ సర్పంచ్‌కు.. ఉపసర్పంచ్ సవాల్

నవతెలంగాణ-నందిపేట్

తనపై లేనిపోని అభియోగాలు మోపడం సరికాదని నందిపేట్ ఉప సర్పంచ్ మాధ రవికుమార్ (భరత్) అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ భర్త సాంబారు తిరుపతి తన పై లేనిపోని నిందలు ఎత్తడం సరికాదన్నారు. నందిపేట మండల ప్రజలకు నిజం తెలియాల్సి ఉందని, సర్పంచ్ భర్త కుల రాజకీయాలు చేస్తున్నాడని, గ్రామపంచాయతీకి, కులాలకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. గతంలో అనేక అక్రమాలకు పాల్పడటంతోనే చెక్కు పవర్ పోయిందని, అది గమనంలో ఉంచుకోవాలని సూచించారు. బిల్లులు వచ్చేవి ఉంటే గనుక తనను గెలిపించిన గ్రామ ప్రజల సమక్షంలో గ్రామసభ ఏర్పాటు చేసి అధికారులను, పత్రికా విలేకరులను పిలిచి తప్పొప్పుల పైన మాట్లాడేందుకు దమ్ముందా అని సవాల్ విసిరారు. తాను ప్రజల ఓట్లతో గెలిచిన వాడినని, ఎక్కడపడితే అక్కడ సంతకాలు పెట్టడం రాదని, పై అధికారుల సూచన మేరకు, గ్రామ అభివృద్ధి దష్ట్యా ఇప్పటివరకు దాదాపు 52 లక్షల రూపాయల చెక్కులపై సంతకాలు పెట్టానని తెలిపారు. తనను గెలిపించిన ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం తనకు ఉందని, కుల రాజకీయాలతో ఊరికే బురద చల్లుతే సహించబోనని అన్నారు. దమ్ముంటే గ్రామసభ ఏర్పాటు చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మాన్సూర్ భూమేష్, గంధం సాయిలు, రఫిక్, దాబా గంగన్న, బిఆర్ఎస్ నాయకులు సలీం, మదర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉప సర్పంచ్

మహిళా రైతులు
చేపల పెంపకంపై దృష్టి సారించాలి

- అందుకు అధికారులు అవగాహన కల్పించాలి : కలెక్టర్

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రతి గ్రామంలోని మహిళా సంఘాల నుంచి పదిమంది మహిళా రైతులను ఐకెపి అధికారులు గుర్తించి, చేపల పెంపకం చేపట్టే విధంగా చూడాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. సదాశివనగర్ మండలం మోడేగామ, భూంపల్లి గ్రామాల్లో మంగళవారం ఫిష్ పాండ్‌లను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్కువ పెట్టుబడి తో అధిక లాభాలు పొందే వీలుందని సూచించారు. మహిళలు చేపల పెంపకానికి ముందుకు రావడం అభినందనీయ మని కొనియాడారు. బ్యాంకు లింకేజీ రుణాలు చేపల పెంపకానికి వినియోగించుకోవచ్చని తెలిపారు. చేపలు పెంచే మహిళా రైతులు ప్రతిరోజు నాలుగు సార్లు వాటికి దాణ వేస్తే సరిపోతుందని చెప్పారు. నాలుగు నెలల్లో చేపలు బరువు పెరిగి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. చేపల పెంపకం ద్వారా మహిళా రైతులు ఆర్థికంగా స్వాలంబన సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎంపీపీ అనసూయ, జడ్పీ టీసీ కమిలి నర్సింలు టిఆర్‌యస్ మండల అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి రైతు బంధు అధ్యక్షుడు భూంరెడ్డి, డీపీఎంలు రవీందర్రావు, రమేష్ బాబు, ఏపీఎం రాజిరెడ్డి, సమన్వయకర్తలు రాములు, ఆంజనేయులు, అబ్బ లింగం, నరేందర్ రెడ్డి, కృష్ణాంజలి, సౌజన్య, పర్యవేక్షకురాలు లత, మహిళలు పాల్గొన్నారు.


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

విధినిర్వహణ ఇష్టంగా నిర్వహించాలి

నవతెలంగాణ-పిట్లం

విధి నిర్వహణ ఇష్టంగా నిర్వహించిన ట్లయితే ప్రతిఫలం అధిక రేట్లు ఉంటుందని ఇన్‌చార్జి సీడీపీవో కళావతి అన్నారు. మంగళ వారం మండలంలోని పోతు రెడ్డిపల్లి అంగన్వాడి పాఠశాలలో నిర్వహించిన పిట్లం క్లస్టర్ సమావేశంలో ఇటీవల సూపర్వైజర్ పదోన్నతి పొందిన తిమ్మా నగర్ తాండ టీచర్ సుమలతకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న ఉద్యోగంలో కృషి పట్టుదలతో ఇష్టంగా వ్యవహరించినట్లయితే శాఖపరమైన టువంటి గుర్తింపు , పై అధికారుల మన్నులతో పాటు తోటి వారి ఆదరభిమానాలు పుష్కలంగా అందుతాయని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రేణుక, కంప్యూటర్ ఆపరేటర్ నౌసిన్ మేడం , టీచర్లు రాధ, అనురాధ , గంగామని , సుమలత , జయంతి , శోభ , బాలమని , బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.


సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందిన సుమలతకు సన్మానించిన అంగన్‌వాడీలు

ఆవాస పాఠశాల ప్రారంభం

నవతెలంగాణ- రామారెడ్డి

మండలంలో ఉప్పలవాయిలో మంగళవారం ఆవాస ప్రాంత పాఠశాలను జిల్లా విద్యాధికారి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ... బడీడు పిల్లలు అందరూ బడిలో చేర్పించేందుకు ప్రతి ఒక్క సహకరించాలని, ప్రతి పిల్లవాడు చదువుకొని ప్రయోజకుడు కావాలని, సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. ఇటుక బట్టీల వద్ద 22 మంది బడిడు పిల్లలను గుర్తించి సి అర్ పి మహమ్మద్, మండల, జిల్లా విద్యాధికారులకు నివేదిక ఇవ్వగా, ఆవాస ప్రాంత పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి వేణు శర్మ, ఎం ఈ ఓ యోసుఫ్, స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, శంకర్, ఇటుక బట్టి యజమాని గోవింద్, సిఆర్పి మహమ్మద్, వివి వెంకటేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కంటి వెలుగులో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల కోసం ఈ కార్యక్రమాన్నీ చేపడుతోందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అవసరమున్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్ రాము, ఎరుకల సాయిలు, బి ఆర్ ఎస్ నాయకులు అరవింద్ గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ సామగ్రి చోరీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని దుండగులు 70 వేల రూపాయల విలువ గల డ్రిప్ సామగ్రిని దొంగలించారు. వ్యవసాయ బావి వద్ద గమనించిన బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గణేశ్నాన్ని చేరుకొని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్‌గల్ మడల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సీపీఎస్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
బుధవారం 01 ఫిబ్రవరి 2023

ఎస్‌ఎఫ్‌ఐ ఆటల పోటీల కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆటల పోటీల కరపత్రాలను యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద మంగళవారం ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దత్తహరి, స్పోర్ట్స్ ఇంచార్జ్ డాక్టర్ నేత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉత్సాహం ఇస్తాయన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న ఆటల కార్యక్రమాన్ని యూనివర్సిటీ విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కార్యదర్శి శ్రీశైలం మాట్లాడుతూ.. ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలతో పాటుగా అనేక సాంస్కృతిక, ఆటల కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, వెంకటేష్, సంధ్య, సాయిప్రసాద్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ ఉపసర్పంచ్‌పై చర్యలు తీసుకుంటాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నందిపేట్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్‌పైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ రాజ్ అధికారిణి జయసుధ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి, భర్త తిరుపతి గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు ఇవ్వాలని ఆత్మహత్యాయత్నం చేసిన నేపథ్యంలో దానికి సంబంధించి ఉపసర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీపీవో మంగళవారం మీడియాకు తెలిపారు. పనులు పూర్తిచేసి ఎంబీ రికార్డ్ అయిన బిల్లులకు ఉపసర్పంచ్ సంతకాలు చేసి బిల్లులు చెల్లించాలని తెలిపారు. అదేవిధంగా నందిపేట మండలంలోని ఇతర గ్రామ పంచాయతీల బిల్లులు ఉపసర్పంచుల సంతకాలచే ఆగినవి ఉంటే పనుల పరిశీలించిన అనంతరం వారి బిల్లులు చెల్లించే విధంగా ఉప సర్పంచ్‌లు చెక్కులపై సంతకాలు చేయాలని సూచించారు.

ఏసీడీ చార్జీలను రద్దు చేయాలి

- సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/మోపాల్

ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి (ఇన్చార్జి) వనమాల కృష్ణ అన్నారు. ఏసీడి పేరుతో ప్రజలపై వేస్తున్న అదనపు చార్జీలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ నుంచి వర్ని చౌరస్తాలో గల విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఎస్.ఈ స్పందించకపోవడంతో ప్రజాపంథా నాయకులు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎస్.ఈ బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి (ఇన్చార్జి) వనమాల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలపై ఏసీడీ (అడ్వాన్స్ కంజప్షన్ డిపాజిట్) పేరుతో వేస్తున్న అదనపు భారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలపై వేసే ఈ అదనపు భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంక్షేమం పేరుతో గొప్పలు చెప్పుకునే



ధర్నా చేస్తున్న నాయకులు

కేసీఆర్ ప్రభుత్వం ఏసీడీ పేరుతో భారాలు మోపి, అక్రమ వసూళ్లకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గత సంవత్సరం 500 యూనిట్లపైన ఏసీడీ చార్జీలను మోపిందని, ఈ సంవత్సరం 3 యూనిట్ల కంటే తక్కువ వినియోగించే వినియోగదారులపై ఏసీడీ చార్జీలను మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీపై రెండురేట్లు అదనంగా వసూలు చేయడం వెంటనే ఆపాలని, చెల్లించిన వారికి చార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 27 లక్షల వ్యవసాయ కనెక్షన్‌కు 24 గంటల కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తుందన్నారు. కానీ వాస్తవానికి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. డెవలప్మెంట్ చార్జీల పేరుతో అదనపు భారాలను మోపిందని అన్నారు. అయినప్పటికీ విద్యుత్ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రజలపై భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎం.ఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు ఎం. వెంకన్న, బి.దేవారం, ఎం.నరేందర్, ఎం.ముత్తెన్న, డి.రాజేశ్వర్, బి.మల్లేశ్, పి.రామకృష్ణ, సాయగౌడ్, ఎం.సుధాకర్, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కిషన్, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్, వివిధ ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు నిలిపివేయాలి..

మోపాల్ : విద్యుత్ అధికారులు వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలను నిలిపివేయాలని కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులపై ఆర్థికభారం మోపడం సరికాదన్నారు. అలాగే కాంగ్రెస్ కార్పొరేటర్ రోహిత్‌పై పోలీసుల అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని ఆయన పేర్కొన్నారు. నగర సంస్థ పరిధిలో సమస్యలపై ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన రోహిత్‌తోపాటు మిగతా నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేవలం బీఆర్ఎస్ నాయకుల మెప్పుకోసం పోలీసులు పని చేస్తున్నారని విమర్శించారు. దీనిపై న్యాయపరంగా పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి, మండలాధ్యక్షులు బన్నీ రవి, కుచంపల్లీ సూర్యరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబయ్య, యువనాయకుడు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తి ఆరోగ్య కార్యకర్తలకు ఘన సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి సబ్ సెంటర్ పరిధిలో 100శాతం నార్మల్ డెలివరీలు చేసి జనవరి 26న కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జానకి, రాణిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని నార్మల్ డెలివరీ చేయడంతో పాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నందుకు వారికి అవార్డులు దక్కిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు డాక్టర్ కావ్య, పీహెచ్ఎం రాణి, హెచ్‌ఈవోలు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, సూపర్‌వైజర్ మాలంబి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగును అరికట్టాలి

నవతెలంగాణ-నందిపేట్

వరిలో కాండం తొలుచు పురుగును అరికట్టాలని మండల వ్యవసాయ అధికారి జోస్నా భవానీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆంధ్రనగర్, ఐలాపూర్, ఖుద్వాన్‌పూర్ గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే దశ నుంచి పిలకలు వేసే దశలో ఉన్నందున కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

జిల్లా సాధనకై రిలే దీక్షలకు పెయింటర్స్ అసోసియేషన్ నాయకులు మద్దతు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకై బోధన్ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలలో బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, సంజీవ్, హసన్‌బేగ్, ఎమ్.వెంకట్, వెంకటరమణ, ఎండి.ఖదీర్ పాషా, అజ్మత్ ఖాన్, టి.గోపిసింగ్, జి.విజయ్, నజీర్, మహేష్, కలీమ్, రఘు, మోహిజ్, జావిద్, రిజ్వాన్ మంగళవారం దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షలు మంగళవారానికి 44వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు యమ్.గంగారెడ్డి, న్యాయవాది సి.హెచ్.వి.హన్మంతరావు, అడ్లూరి శ్రీనివాస్, బాణోత్ రమేష్, వి.చైతన్య, బీస్పీ పార్టీ నాయకులు పాండు సంఘీభావం తెలిపారు.

నాందేడ్ సభ ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-బోధన్

మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో ఫిబ్రవరి 5న భారత రాష్ట్ర సమితి నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను బోధన్ మండల నాయకులు, డీసీసీబీ డైరెక్టర్లు శరత్, గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ షకీల్, రైతు సమితి మాజీ మండల అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్, సాలూర మండల నాయకులు కేజీ గంగారం మంగళవారం పరిశీలించారు. భారతీయ రాష్ట్ర సమితి జాతీయ నాయకులు, సీఎం కేసీఆర్ తొలిసారి మహారాష్ట్రలో మహాసభ నిర్వహిస్తున్నందున నాయకులు సభకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. సభను విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని వారు కోరారు.

నూతన పంచాయతీ కార్యాలయం మంజూరు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

మండలంలో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన సులేమాన్‌నగర్ గ్రామనికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషితో పంచాయతీ కార్యాలయం మంజూరు అయినట్లు సర్పంచ్ ఖాదర్ తెలిపారు. త్వరలో నిధులు కూడా మంజురు చేస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపినట్లు పేర్కొన్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, సిబ్బంది, ప్రజలు స్పీకర్‌కు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఇంచార్జ్ పోచారం సురేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వరి పంట పొలాలను సందర్శించిన ఏఓ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బొర్గం(కె), ఓడ్యాట్‌పల్లి, కృష్ణానగర్ గ్రామాలలో మండల వ్యవసాయ అధికారిని పద్మ మంగళవారం వరి పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిరికొండ

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 27వ తేదీ శనివారం మండలంలోని కుర్దులోపేట్ గ్రామ సమీపంలో గల చౌరస్తా వద్ద న్యావనంది గ్రామానికి చెందిన సాగర్‌రెడ్డి, కుర్దులోపేట్ గ్రామానికి చెందిన నడిపి గంగారాం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో, తీవ్ర గాయాలపాలైన సాగర్ రెడ్డి, జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో వృద్ధులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కలిసిన పద్మశాలీ సంఘం సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన శివ మార్కండేయ పద్మశాలి సంఘ సభ్యులు మంత్రి ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృ హంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఏర్గట్లలో నిర్మిస్తున్న మార్కండేయ ఆలయానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. ఆయన స్పందించి ఆలయ అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్టు సంఘం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, ఏర్గట్ల మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు పిట్ల నరేష్, ఏర్గట్ల పద్మశాలి సంఘ అధ్యక్షులు కామని శివకుమార్, సభ్యులు బొచ్చు వేణుగోపాల్, మచ్చ మారుతి, సీహెచ్ మనోహర్, చుక్కల నరేష్, మచ్చ నవీన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించాలి

నవతెలంగాణ-సిరికొండ

18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు తప్పక నిర్వహించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని న్యావనంది, కుర్దులోపేట్ గ్రామాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలో వికలాంగులు ఉన్నట్లయితే, కంటి వెలుగు క్యాంపుల వద్దకు వారికి రవాణా గ్రామ పంచాయతీ నుంచి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అరవింద్, సీహెచ్‌ఓ అనంతరావు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయిత్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కుదియా తబస్సుం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో రాజగంగారం ముఖ్య అతిథిగా, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కవిత విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుదియా తబస్సుం సేవలను కొనియాడారు. నిరుపేద పిల్లలకు అనేక విషయాలలో ప్రత్యేక చొరవ చూపి తను పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన వస్తువులు ఉచితంగా పంపిణీ చేయడం నిజంగా అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు మల్లయ్య, రవికుమార్, ప్రధానోపాధ్యాయురాలు సంతోష్ రాణి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిరణ్, అదిభా, హెప్సీబా, రుకియాబేగం తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు మార్గంలో వెళ్లొద్దు

నవతెలంగాణ-సిరికొండ

యువత చెడుమార్గంలో ప్రయాణించవద్దని, నేటి యువకులే దేశ చరిత్రను తిరగ రాసే పౌరులవుతారని, ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. యువత చెడు మార్గంలో ప్రయాణించి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గ్రామాలలో ఇప్పటికీ నాటు తుపాకులు తయారుచేసి వన్యప్రాణులను వేటాడుతున్నారని, దీనివల్ల తమ ప్రాణాలకే ప్రమాదమని, ఎవరి వద్దనైనా నాటు తుపాకీలు ఉంటే స్వచ్ఛందంగా తమకు అప్పగించాలని, వారిపైన ఎలాంటి చట్టపరమైన కేసులు విధించబోమని ఆయన తెలిపారు. అదేవిధంగా గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీలు, గ్రామ ప్రజలు కలిసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, నేరస్తులను తప్పించుకోనివ్వకుండా కాపలా కాస్తుందని తెలిపారు.

భూమిపూజకు రావాలని ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో 3న నిర్వహించే అదనపు గదుల నిర్మాణ పనుల భూమిపూజకు ఎమ్మెల్యే, రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించినట్టు సర్పంచ్ చంద్రకళ బాలకిషన్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన 54వ గణతంత్ర వేడుకల్లో భాగంగా మండలంలోని కోనాసమందర్ క్లస్టర్లో పనిచేస్తున్న వర్ధం శ్రీనివాస్ జిల్లా స్థాయిలో ఉత్తమ సిసిగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన సందర్భంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల సెర్ప్ ఏపిఎం కుంట గంగారెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయడం, సంస్థాగత నిర్మాణం, కొత్త వ్యాపారాలను ప్రోత్సహించడం, కోనాపూర్, కొనసాముందర్ గ్రామాలలో కొనుగోలు కేంద్రా లను నిర్వహించడం వంటి అంశాల్లో రాణించినందుకు గాను వర్ధం శ్రీనివాస్ జిల్లా స్థాయి ఉత్తమ సిసిగా ఎంపికైనట్టు తెలిపారు. స్థానికంగా పనిచేస్తున్న సిబ్బంది అంతా చాలా చక్కగా పనిచేస్తున్నారని, కష్టపడి పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు వస్తుందని ఏపిఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, సీసీలు భోజన్న, రవికుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, సిబ్బంది ధనలక్ష్మి, అనసూయ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

కుష్టువ్యాధిపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో కుష్టు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఇందూరు సైకియాట్రిక్ ఆసుపత్రిలో అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. నేటి రోజులలో కుష్టు అనేది ప్రపంచవ్యాప్తంగా నిర్మూలనలో దగ్గరగా ఉందని, అది ప్రాథమిక దశలోని గుర్తించినట్లయితే అతి త్వరగా నయం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వారికి క్లబ్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల, డాక్టర్ బి.రాజేంద్రప్రసాద్, రాజకుమార్, సుబేదార్, వి.శ్రీనివాసరావు, రామకృష్ణ, వాసుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని సికింద్రాబాద్ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు ఐకేపీ స్త్రీనిధి ద్వారా సోలార్ విద్యుత్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనిధి ఆర్ఎం రాందాస్ సోలార్ విద్యుత్ ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎం కుంట శ్రీనివాస్, సీసీ నరేష్, సాయిలు, గంగాధర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ అరవింద్‌ను సస్పెండ్ చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ అరవింద్‌ను సస్పెండ్ చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్య అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలోని అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచర్ విద్యార్థినీలు పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఘటనలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులను కలిశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా కమిటీ సభ్యులు నర్సక్క, అంబికా పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ధర్పల్లి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి వెలుగు ప్రత్యేకతలపై, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై, పథకాలపై ప్రజలు ఎలా స్పందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈశిబిరాల్లో ప్రతి రోజు 150 మందికి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కంటి వెలుగు సూపర్‌వైజర్ నిర్మల, రామడుగు సొసైటీ చైర్మెన్ ధర్మయ్యగారి రాజేందర్ రెడ్డి, వార్డుమెంబర్ బియన్ రెడ్డి, నాయకుడు సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన బడిలో పాఠశాలలు ప్రారంభానికి సిద్ధం

మన ఊరు-మన బడి కార్యక్రమంలో విద్యార్థులకు పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు పాఠశాల భవనాలు సుందరంగా తీర్చిదిద్దారని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉర్దూ ప్రైమరీ, ఎంపీపీఎస్ తెలుగు మీడియం పాఠశాలలకు సందర్శించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాఠశాలలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాల్‌రాజ్, ఎంపీడీఓ నటరాజ్, పీఆర్ఏఈ అహేమద్ హుస్సేన్, ఈఓపీఆర్డీ రాజేష్, వార్డు సభ్యుడు బీఎస్ రెడ్డి, ఏపీఓ వినోద తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు, ఉత్తమ వ్యవసాయ శాఖ అధికారిగా అవార్డును జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి తన కార్యాలయ ఆవరణంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వరరావును పూలమాలలు వేసి శాలువాతో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కే శ్రీనివాస్, కిసాన్ ఆగ్రో దుకాణ యజమాని హైమద్, సహకార సంఘం పాలకవర్గం పండరినాథ్, కార్యదర్శి రాజారాం, సేల్స్ మెన్ ప్రభాకర్ గౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

ఎడపల్లి తహసీల్దార్‌కు సన్మానం..

ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్ జనవరి 26న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతులమీదుగా ఉత్తమ తహసీల్దార్ అవార్డును అందుకున్న సందర్భంగా ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు మల్కారెడ్డి ఆకుల శేఖర్‌ను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.

హెూటల్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్ కళాశాల నెలకొల్పడం అభినందనీయం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ లాంటి నగరంలో సీఈవో రత్నాకర్ హెూటల్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్ కళాశాల నెలకొల్పడం అభినదనీయమని నగర మేయర్ నీతూకిరణ్ అన్నారు. మంగళవారం ఇన్ఫినిటీ హెూటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. తెలంగాణ వంటలు దేశ విదేశాల్లో ప్రఖ్యాతి గాంచినవని.. మంచి వంటలు చేసి ఇందూర్‌కు పేరు తీసుకురావాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న తరుణంలో ఫ్యాషన్ డిజైనింగ్, హెూటల్ మేనేజ్‌మెంట్‌కు ఆదరణ ఉందని ఈ కోర్స్ ఎంచుకోవడం, నిజామాబాద్‌లో ఇలాంటి కళాశాల నెలకొల్పడం శుభపరిణామం అన్నారు. భవిష్యత్‌లో మంచి పొజిషన్‌కు రావాలని తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా కన్వీనర్ వినయ్‌సాగర్ జేఎన్‌టీఈ, సీఎస్ హైదరాబాద్ విచ్చేసి విద్యార్థులకు విలువైన టిప్స్ నేర్పించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా 6వ బ్యాచ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో రజిత, స్వర్ణ లత, రాజేశ్వర్, శశి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వేములపల్లి కిరణ్‌కుమార్ 32వ వర్ధంతి సభ

నవతెలంగాణ-సిరికొండ/మాక్లూర్

ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ రాష్ట్ర కన్వీనర్, నిజామాబాద్ జిల్లా తొలి కన్వీనర్, కామ్రేడ్ వేములపల్లి కిరణ్ కుమార్ 32 వర్ధంతి సభను మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. పీవైఎల్ మండల అధ్యక్షుడు బి.సాయన్న, జిల్లా సహాయ కార్యదర్శి మార్క్స్ మాట్లాడారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ సెక్రటరీ వి.బాలయ్య పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని బొర్గం(కె) గ్రామంలోనూ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షులు దేశెట్టి సాయి రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో టి.కృష్ణగౌడ్, సిర్రం శంకం తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలకు రూ.50 కోట్లు కేటాయించండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ కళాశాల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దోనికొని ప్రమోద్, విజయ్, బోజెందర్, మణికంఠ, వర్ధన్, ప్రాకృద్దీన్, రాజేశ్వర్, అజయ్, అఖిల్, అంకిత్, విష్ణు, మహేశ్, చారి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో 60 శాతం విద్యారంగానికి కేటాయించాలి : టీజీవీపీ

కంఠేశ్వర్ : బడ్జెట్లో 60 శాతం విద్యారంగానికి కేటాయించాలని టీజీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్, ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఇంచార్జ్ ఎర్ర ప్రవీణ్, నగర అధ్యక్షుడు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యా పాఠశాల వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని విద్య హైస్కూల్‌లో పాఠశాల వార్షికోత్సవాన్ని ప్లాజా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్‌లు విద్య ప్రవీణ్ పవార్, గోపి కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్పుతే శ్రీనివాస్, లోటస్ పాటశాల ప్రిన్సిపాల్ అంబికా పవార్, వరంగంటి లావణ్య, తులసి, రాజేశ్వర్, ఇమ్రాన్, కవిత, నాజియా, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఆదర్శ రైతు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి రామారావు చేతుల మీదుగా అందుకున్నట్టు ఆదర్శ రైతు నాగుల చిన్న గంగారం మంగళవారం తెలిపారు.

